సాక్షి కాకినాడ

శుక్రవారం | 15 | సెప్టెంబర్ | 2023



కాలువలకు నీరు

ధవళేశ్వరం:కాటన్ బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 4,600, మధ్య డెల్టాకు 2,200, పశ్చిమ డెల్టాకు 6,000క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.



యువతది కీలకపాత్ర

ప్రపంచ దేశాలలో యువత ఎక్కువగా ఉన్నది భారతదేశంలోనే అని నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు.

II లో

అక్రమ మద్యం ధ్వంసం



అమలాపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూర్ (ఎస్‌ఈబీ) స్టేషన్ పరిధిలో 28 కేసులకు సంబంధించిన రూ.95 వేల విలువైన అక్రమ మద్యాన్ని గురువారం సాయంత్రం ధ్వంసం చేశారు.

II లో

న్యూస్‌రీల్

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలేశ్వరం: ప్రతిభ ఉండి ఆర్థికంగా వెనుకబడిన పేదవిద్యార్థులకు ఉపకార వేతనాలు అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రతిభ స్కాలర్‌షిప్ ట్రస్టు ప్రతినిధులు గురువారం తెలిపారు. ఐఐటీ, నీట్, మెడిసిన్, ఇంజినీరింగ్, ఎంసీఏలో చేరుటకు గాను ఎంసెట్‌లో 10 వేల లోపు ర్యాంకు సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన విద్యార్థులకు స్కాలర్ షిప్ అందిస్తామని ట్రస్టు కార్యదర్శి ఇబ్రహీంఖాన్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు వచ్చే నెల 15 లోపు దరఖాస్తులు పంపాలన్నారు. విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ప్రతిభస్కాలర్‌షిప్‌ట్రస్టు.కామ్ ద్వారా దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దరఖాస్తులను వరుపుల చిట్టిబాబు, శ్రీగణపతి వెంకటసాయి బ్యాంకర్స్, ఆర్టీసీ కాంప్లెక్ ఎదురుగా ఏలేశ్వరం –533429 అడ్రస్‌కు పంపాలన్నారు. మరిన్ని వివరాలకు 73965 26411, 99513 67872 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

తలుపులమ్మతల్లికి రూ.37.59 లక్షల ఆదాయం



లోవ దేవస్థానంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

తుని రూరల్: లోవ దేవస్థానంలోని తలుపులమ్మతల్లికి హుండీల ద్వారా రూ.37,59,808 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. దేవదాయ, ధర్మాదాయశాఖ పెద్దాపురం తనిఖీ అధికారి సీహెచ్ ఉదయ బాబూనాయుడు, ధర్మకర్తల మండలి చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు ఆధ్వర్యంలో గురువారం లోవలో హుండీలను తెరిచి లెక్కించారు. 50 రోజులకు గాను నాణేల రూపంలో రూ.1,24,395, నోట్ల ద్వారా రూ.36,35,413 వెరసి మొత్తం రూ.37,59,808 ఆదాయం వచ్చిందన్నారు. నగదు లెక్కింపులో ధర్మకర్తలు, దేవస్థానం సిబ్బంది, వేదపండితులు, అర్చకులు, బ్యాంకు అధికారులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

నేడు ఉద్యోగ మేళా

కాకినాడ సిటీ: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ వీఎస్ లక్ష్మీ డిగ్రీ కళాశాలలో సుమారు 13 కంపెనీలతో శుక్రవారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. దీనికి సంబంధించి గోడపత్రికను గురువారం కలెక్టరేట్‌లో నైపుణ్య అభివృద్ధి అధికారులతో కలసి ఆవిష్కరించారు. పదో తరగతి నుంచి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన యువతీ యువకులు పాల్గొనవచ్చని కలెక్టర్ తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి.హరిశేషు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

‘స్వగృహ’ప్రాప్తిరస్తు

- టిడ్కో ఇళ్ల అందజేతకు సర్వం సిద్ధం
- రూ.27 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన
- 1,152 మంది లబ్ధిదారులకు నేడు పంపిణీ

కాకినాడ: పేదల గూడు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది.. రా రమ్మని ఆహ్వానిస్తోంది.. సకల సౌకర్యాలతో నిర్మించిన టిడ్కో ఇళ్ల అప్పగింతకు సర్వం సిద్ధమైంది. టీడీపీ పాలనలో జరిగిన లోపాలను సరిదిద్ది అర్హులకు గృహాలను అప్పగించే ప్రక్రియకు గ్రీన్ సిగ్నల్ పడింది. పురపాలక శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్ చేతుల మీదుగా శుక్రవారం జిల్లా కేంద్రం కాకినాడ పర్లోపేటలో 1,152 మంది లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను అప్పగించేందుకు సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు చేశారు.

తొలి విడతలో 1,152 మందికి..

కాకినాడ పర్లోపేటలో 2,056 మందికి టిడ్కో ఇళ్లు మంజూరయ్యాయి. మొత్తం 83 బ్లాక్‌లలో ఒక్కో బ్లాక్‌లో సుమారు 39 ఎకరాల విస్తీర్ణంలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. 430 ఎస్ఎఫ్‌టీలో ప్రైవేట్ లేఅవుట్ తరహాలో రోడ్లు, డ్రైన్లు, ఇతర సకల సౌకర్యాలు కల్పించారు. డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌ల రూపంలో వీటి నిర్మాణాన్ని పూర్తి చేసి చక్కని సదుపాయాలు, టైల్స్ వంటివి కల్పించి లబ్ధిదారుల గృహ ప్రవేశాలకు వీలుగా తీర్చిదిద్దారు. తొలివిడత 1,152 మందికి శుక్రవారం ఇళ్లను అప్పగించనున్నారు.

చొరవ తీసుకుని.. సౌకర్యాలు కల్పించి...

గత టీడీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైన టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని పూర్తి చేయించారు. అక్కడ రోడ్లు, డ్రైన్లు, సీవరేజ్ నెట్‌వర్క్, విద్యుత్, మంచి నీటి సరఫరా వంటి సకల వసతులు ఏర్పాటు చేశారు. దీనికోసం రూ.27 కోట్లు వెచ్చించారు. దాదాపు పనులన్నీ చివరి దశకు చేరుకోవడంతో తొలి విడతగా 50 శాతం ఇళ్లను అప్పగిస్తున్నారు.

రూ.7.65 లక్షలకు టిడ్కో ఇల్లు

టిడ్కో ఇంటి నిర్మాణానికి రూ.7.65 లక్షలు ఖర్చు అవుతుందని నిర్ణయించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.2 లక్షలు, కేంద్ర వాటా రూ.1.5 లక్షలు, లబ్ధిదారుని వాటా రూ.50 వేలు, బ్యాంక్ నుంచి రుణం రూ.3.65 లక్షలను సమకూర్చారు. ఆ మేరకు నగరపాలక సంస్థ కమిషనర్ నాగనరసింహారావు పర్యవేక్షణలో ఎప్పటికప్పుడు టిడ్కో అధికారులు, బ్యాంకర్లతో సమావేశమై లబ్ధిదారులకు రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నారు.

టీడీపీ వల్లే జాప్యం

గత టీడీపీ హయాంలో జరిగిన తప్పిదాలతో లబ్ధిదారులకు సకాలంలో ఇళ్లు అప్పగించలేని పరిస్థితి ఎదురైంది. 2,056 ఇళ్లు మాత్రమే మంజూరైతే రాజకీయ లబ్ధి కోసం, ముడుపులు దండుకుని సుమారు 4 వేల మందిని మభ్యపెట్టి పెద్ద ఎత్తున లబ్ధిదారుని వాటాగా సొమ్ము తీసుకున్నారు. ఆ తరువాత ప్రభుత్వం మారడంతో సొమ్ము చెల్లించిన లబ్ధిదారులు గగ్గోలు పెట్టడంతో ఈ సమస్యను కొలిక్కి తెచ్చి అక్కడ మౌలిక సదుపాయాలను కల్పించి ఇళ్ల నిర్మాణం చేపట్టడంలో జాప్యం జరిగింది.

ఉచితంగా రిజిస్ట్రేషన్లు

ప్రభుత్వ ఆదేశాల మేరకు టిడ్కో ఇళ్లకు ఉచితంగా రిజిస్ట్రేషన్లను చేసి అప్పగిస్తున్నారు. వాస్తవానికి అక్కడ జరిగిన నిర్మాణాలకు నిబంధనల ప్రకారం రూ.70 వేల వరకూ రిజిస్ట్రేషన్ ఖర్చు అవుతుంది. అయితే లబ్ధిదారుల నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇళ్లను అప్పగిస్తున్నారు. ఈ టిడ్కో ఇళ్ల అప్పగింత కార్యక్రమం రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్ చేతుల మీదుగా శుక్రవారం ఉదయం 10 గంటలకు జరుగనుంది. దీనికి ఎంపీ వంగా గీతతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు.



సీఎం చొరవతో న్యాయం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న చొరవ వల్లే టిడ్కో లబ్ధిదారులకు ఇళ్ల అప్పగింత ప్రక్రియ కొలిక్కి వచ్చింది. గత టీడీపీ ప్రభుత్వం కమిషన్లకు కక్కుర్తి పడి అత్యధిక మొత్తాలకు కాంట్రాక్టులు ఇవ్వడం, ఇళ్ల మంజూరుకు భిన్నంగా ముడుపులు తీసుకుని లబ్ధిదారులను మభ్యపెట్టడం వల్ల సమస్య తలెత్తింది. వీటన్నింటిని పరిష్కరించి రూ.27 కోట్లతో మౌలిక సదుపాయాలు కూడా కల్పించి ఇళ్లు అప్పగిస్తున్నాం.

– ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్యే, కాకినాడ

రైల్వే జీఎంకు వినతి



రైల్వే జీఎంను సత్కరించిన స్థానిక రైల్వే అధికారులు

సామర్లకోట: దువ్వాడ రైల్వే స్టేషన్ నుంచి రాజమహేంద్రవరం వరకూ విండో ఇన్‌స్పెక్షన్ చేస్తున్న రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌ను స్థానిక రైల్వే అధికారులు కలిశారు. విశాఖపట్నం–షిరిడీ ఎక్స్‌ప్రెస్ రైలులో సామర్లకోట వచ్చిన ఆయన స్థానిక మూడో నంబర్ ప్లాట్‌ఫారంపై దిగారు. ఆయనకు స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సంఘ కార్యదర్శి శ్రీనివాస్ వినతి పత్రం అందజేశారు. రైల్వే స్టేషన్ ఆవరణలో పారిశుధ్య సిబ్బంది కొరత కారణంగా అపరిశుభ్రత నెలకొంటుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని పిఠాపురం నుంచి అనపర్తి వరకూ సిబ్బందిని నియమించాలన్నారు. అనంతరం సంఘ నాయకులు జీఎంను సత్కరించారు. జీఎం కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, డీఆర్ఎం ఆనందరావు పాటిల్, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ నరేంద్రవర్మ, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ కోఆర్డినేటర్ వరుణ్‌బాబు, స్థానిక రైల్వే ఏడీఈఎన్ బి.శివప్రసాద్, ఎంప్లాయీస్ సంఘ కార్యదర్శి ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

17న బాల్ బ్యాడ్మింటన్ సబ్ జూనియర్స్ ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 17న సబ్ జూనియర్స్ విభాగంలో క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘ నిర్వహణా కార్యదర్శి వీకేఆర్ తంబి గురువారం తెలిపారు. స్థానిక అన్నవరం సత్యదేవ జూనియర్ కాలేజీలో ఉదయం 9 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. 2008 జనవరి 2 నుంచి లేదా తరువాత జన్మించిన వారు అర్హులన్నారు. వయసు ధ్రువీకరణ పత్రాలతో ఎంపికలకు హాజరుకావాలని ఆయన కోరారు. ఎంపికైన జట్లు ఈ నెల 30 నుంచి అక్టోబర్ 2 వరకూ నంద్యాలలో జరిగే అంతర్ జిల్లాల పోటీలలో పాల్గొంటాయని సంఘ అధ్యక్షుడు ముప్పన వీరభద్రస్వామి, కార్యదర్శి వీర్రాజు తెలిపారు.

నేడు మంత్రి ఆదిమూలపు రాక



మంత్రి ఆదిమూలపు సురేష్

కాకినాడ: రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ శుక్రవారం కాకినాడ రానున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పర్యవేక్షణలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఏర్పాటు చేశారు. పర్లోపేటలో టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించే కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు. అనంతరం 10.30 గంటలకు డెయిరీ ఫారం పిడుగులమ్మ గుడి వద్ద ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత బస్సు సౌకర్యాన్ని ప్రారంభిస్తారు. 10.45 గంటలకు రాజీవ్ గృహకల్ప వద్ద కొత్తగా నిర్మించిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభిస్తారు. 11 గంటలకు ఇటీవల స్మార్ట్‌సిటీలలో దేశంలో రెండో స్థానాన్ని సాధించిన సందర్భంగా పారిశుధ్య విభాగానికి చెందిన సుమారు వెయ్యి మంది కార్మికులకు స్థానిక డీ కన్వెన్షన్‌లో దుస్తులు పంపిణీ చేస్తారు. 11.30 గంటలకు రాగంపేటలోని రెల్లిపేటలో ఎస్సీ కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు బాలాజీచెరువు సెంటర్ వద్ద అంబేడ్కర్ కళాశాల బాలుర వసతి గృహ నిర్మాణానికి శ్రీకారం చుడతారు. చివరగా మధ్యాహ్నం 12.30 గంటలకు శారదాదేవి ఆలయం వద్ద జంక్షన్ అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు పర్యవేక్షణలో అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రభుత్వ భవన నిర్మాణ పనులపై దృష్టి

జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా



కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ భవన నిర్మాణ పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో కాకినాడ కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ, జిల్లా స్థాయి ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టరు సమావేశమయ్యారు. జిల్లాలో వివిధ దశల్లో ఉన్న గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా పురోగతి చూపాలన్నారు. చివరి దశ పనులు పూర్తయిన భవనాల వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. భవనాలను ప్రారంభోత్సవాలకు సిద్ధం చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. గృహ నిర్మాణ పనులలో పురోగతి కనబరచాలన్నారు. మిగిలిన లేఅవుట్‌ల్లో లెవలింగ్, స్టోన్ ప్లాంటేషన్ పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకం సంబంధించి భూ హక్కు పత్రాల పంపిణీ ప్రక్రియపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పూర్తి చేయాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో రీఓపెన్ అయ్యే అంశాలను పరిశీలించాలన్నారు. అంతకు ముందు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ అంశాలకు సంబంధించి రీ సర్వే, జాతీయ రహదారులకు సంబంధించి మార్క్‌ఫెడ్, హౌసింగ్, లేఅవుట్ పనులు గృహనిర్మాణాలు, గ్రామీణాభివృద్ధి, ప్రభుత్వ శాశ్వత భవనాలు, ఉపాధి హామీ పథకం పనులు, స్వామిత్వ, జగనన్నకు చెబుదాం తదితర ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల అమలుపై కలెక్టర్, జేసీ, ఇతర జిల్లా అధికారులతో చర్చించారు. సమావేశంలో సీపీఓ త్రినాథ్, వ్యవసాయశాఖాధికారి ఎస్ విజయకుమార్, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్‌ది దిగజారుడు రాజకీయం

- ప్యాకేజీ కోసమే ‘బాబు’తో ములాఖత్
- కాకినాడ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: దేశంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ అంతటి అవినీతిపరులు ఎక్కడా లేరంటూ 2018–19లో ఊరూవాడా ప్రచారం చేసిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు ఇప్పుడు వాళ్లిద్దరూ ఎలా మంచి వారయ్యారో సమాధానం చెప్పాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి నిలదీశారు. గురువారం సాయంత్రం స్థానికంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అవినీతి కేసులో ఆధారాలతో సహా దొరికిపోయి జైలులో ఉన్న చంద్రబాబును పవన్‌కల్యాణ్ కలవడం హాస్యాస్పదమన్నారు. కేవలం ప్యాకేజీని మాట్లాడుకొనేందుకే అక్కడకు వెళ్లారని ఆరోపించారు. ప్రజలు వింటున్నారని పవన్‌కల్యాణ్ ఏదో ఒకటి మాట్లాడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ముసుగు తొలగించుకుని టీడీపీ–జనసేన కలసి పోటీ చేస్తామని ప్రకటించారన్నారు. ఇక పొత్తుల్లో ఎవరెవ్వరు ఎక్కడెక్కడ పోటీ చేస్తారో కూడా ప్రకటిస్తే ఎంతో మంది కేడర్‌కు న్యాయం చేసిన వారవుతారన్నారు. జనసేనను నమ్ముకుని ఎంతో మంది రూ.లక్షలు ఖర్చు పెట్టి రోడ్డున పడుతున్నారని, అటువంటి వారి కోసమైనా నిజాలు చెబితే జాగ్రత్త పడతారన్నారు. టీడీపీ వద్ద అవినీతి సొమ్ము పుష్కలంగా ఉందని అన్నారు. వారాహి యాత్రలో భాగంగా కాకినాడ జిల్లా ప్రత్తిపాడు సమీపంలో ఓ యువకుడు రూ.14 లక్షలు ఖర్చు చేసి అప్పులపాలై పెరాలసిస్ స్ట్రోక్‌తో మంచాన పడ్డారన్నారు. అప్పుడు వారాహి వాహనంలో అతన్ని పరిచయం చేయలేకపోయారని, ఆ వ్యక్తి ఎవరో కూడా పవన్‌కు తెలియదన్నారు. ఇలాంటి ఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు.

మీ చిట్టి చేతులతో మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

ఆంధ్రప్రదేశ్
ANDHRA PRADESH
AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. ‘అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా’ అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది. ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకువెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం! జిల్లా స్పాన్సర్‌గా శ్రీ షిర్డి సాయి విద్యా సంస్థలు వ్యవహరిస్తున్నారు.

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా :

శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్
సురేష్‌నగర్, కాకినాడ

తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన
ఫోన్ నంబరు : 9010224454


District sponsor

SRI SHIRDI SAI
GROUP OF EDUCATIONAL INSTITUTIONS
RAJAHMUNDRY KADIYAM
website : www.sssjc.in

ఆలయాభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు

పెదపూడి: మండలంలోని కరకుదురులో రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయ అభివృద్ధికి రూ.50 లక్షల సీజీఎఫ్ నిధులు మంజూరయ్యాయని హితకారిణి సమాజం డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, ఆలయ కమిటీ చైర్మన్ సుబ్బారావు చౌదరి తెలిపారు. గురువారం వారిద్దరూ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నిధుల విడుదలపై విజయవాడలోని దేవదాయ, ధర్మాదాయ శాఖ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. నిధుల విడుదలకు కృషి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సానా ఉమాపార్వతి, చుండుబాబు, అడబాల నూకరత్నం, కొండయ్యపాలెపు రమణ, వనుం కనక దుర్గమ్మ, చేటకాళ్ల ప్రసాద్, మందపల్లి బుల్లిరాజు తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుని హుండీ ఆదాయం రూ.19,61,715



అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరుని హుండీల ఆదాయాన్ని గురువారం ఆలయ అధికారులు లెక్కించారు. 55 రోజులకు గాను రూ.19,61,715 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. పది విదేశీ నోట్లు లభించాయన్నారు. ఆలయ పర్యవేక్షణాధికారి డి.సాయిబాబు పర్యవేక్షణలో ఈ హుండీ ఆదాయాన్ని లెక్కించారు. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు, గ్రామస్తులు, సేవాదళ సభ్యులు ఉన్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి వేణుగోపాలకృష్ణ, హోం మంత్రి డాక్టర్ వనిత, సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రఘురాం, పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు, కలెక్టర్ డాక్టర్ మాధవీలత



సభా వేదిక వద్ద ఏర్పాట్లను సమీక్షిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి వేణుగోపాలకృష్ణ, హోం మంత్రి వనిత, సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రఘురాం, పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, ఎంపీ భరత్, ఎమ్మెల్యేలు శ్రీనివాసనాయుడు, వెంకట్రావు, కలెక్టర్ డాక్టర్ మాధవీలత

- సమీక్షించిన మంత్రులు..అధికారులు
- రేపు కాపు నేస్తం నిధులు బటన్ నొక్కి జమ చేయనున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

నిడదవోలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 16న నిడదవోలు పర్యటన విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, హోం మంత్రి తానేటి వనితలు పేర్కొన్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో గురువారం స్థానిక సెయింట్ ఆంబ్రోస్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో వీరు ఎంపీ మార్గాని భరత్, కలెక్టర్ మాధవీలత, జిల్లా ఎస్పీ జగదీష్, సీఎం ప్రొగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం, జెడ్పీ చైర్మన్ విప్పర్తి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా (రాజానగరం), శ్రీనివాసనాయుడు(నిడదవోలు), తలారి వెంకట్రావు(గోపాలపురం)లతో కలిసి ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ కాపుల సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్నారు. శనివారం రాష్ట్ర కాపు నేస్తం కింద ఆ సామాజిక వర్గ మహిళల ఖాతాలకు రూ.15 వేలు వంతున ఆయన బటన్ నొక్కి జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. హోంశాఖ మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ తమ ప్రభుత్వం అర్హులైన పేదవారికి సంక్షేమ పథకాలను, ఆర్థిక ప్రయోజనాలను అందించి ఆర్థిక స్థితగతులను మార్చుతోందన్నారు.

రోడ్ షోలో వసతులు

కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ సీఎం పర్యటనకు సంబంధించి బాధ్యులైన అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కేటాయించిన విధులను సమర్థంగా నిర్వర్తించాలన్నారు. ముందస్తు కార్యాచరణ ప్రణాళిక ఆధారంగా శాఖల మధ్య సమన్వయం చేసుకోవాలన్నారు. రోడ్ షోలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలన్నారు. వర్షం కురిసే అవకాశం ఉన్నందున ఇబ్బంది పడకుండా ఏర్పాటు చేసుకోవాలని మాధవీలత సూచించారు. హెలీప్యాడ్ నుండి సభావేదిక వరకు రోడ్ షో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెద్ద ఎత్తున యువత హాజరవుతారన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీఎం ప్రొగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేయాలని అధికారులకు చెప్పారు. జిల్లా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ బందోబస్తు, బారికేడింగ్, రూట్ ఆపరేషన్, వాహనాల పార్కింగ్, సభా వేదిక వద్ద భద్రత వంటి అంశాలపై ఫోకస్ పెట్టామన్నారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిడదవోలు పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. పర్యటన విజయవంతం కావడానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలన్నారు. మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్ పద్మావతి, ఆర్డీఓలు మల్లిబాబు, చైత్రవర్షిణి, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ సుబ్బలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధి కూలీ మృతి

మలికిపురం: మండలంలోని లక్కవరం గ్రామంలో ఉపాధి కూలీ ఇంజేటి గని కమ్మ(74) గురువారం గుండెపోటులో మృతి చెందింది. పనులు నిర్వహిస్తున్న సమయంలో ఆమె గుండెపోటుకు గురయినట్లు ఉపాధి హామీ ఏపీఓ ఎండీ నాగప్రసాద్ తెలిపారు. ఆయన ఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం కోసం రాజోలు ఆసుపత్రికి తరలించారు.

యువకుడి ఆత్మహత్య

కాకినాడ క్రైం: తల్లి మందలించిందని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దాపురానికి చెందిన సాధనబోయిన శివరామకృష్ణ(18) చదువు మానేసి స్థానిక కోళ్ల ఫారంలో కూలీగా పనిచేస్తున్నాడు. మద్యానికి అలవాటు పడ్డాడు. తాగి వచ్చిన ప్రతిసారి తల్లి రాఘవ తప్పని చెబుతూ మందలించేది. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం తాగి ఇంటికి వచ్చిన శివరామకృష్ణతో తల్లి వాదులాడింది. ఈ క్రమంలో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. తొలుత పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడి వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు సిఫారసు చేశారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి శివరామకృష్ణ ప్రాణాలు కోల్పోయాడు.

విద్యార్థి అదృశ్యం


నక్కా శ్రీతేజ

అమలాపురం రూరల్: నడిపూడి గ్రామం నక్కావారిపేటకు చెందిన నక్కా శ్రీతేజ అదృశ్యంపై తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. 15 సంవత్సరాల వయస్సు గల శ్రీతేజ కొత్తపేట జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతూ అక్కడే ఎస్సీ హాస్టల్‌లో ఉంటున్నాడు. 11వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు నక్కా శ్రీతేజ హాస్టల్ నుంచి తన ఇంటికి వచ్చాడు. 12 తేదీ ఉదయం 7.30 గంటల సమయంలో నక్కా శ్రీతేజ కొత్తపేటలోని హాస్టల్‌కు వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హాస్టల్‌కు చేరుకోలేదు. అతడు ఇప్పటివరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో బాలుడు తండ్రి నక్కా శ్రీనివాసరావు శుక్రవారం రాత్రి అమలాపురం తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు ఎస్సై అందే పరదేశి తెలిపారు. బాలుడి ఆచూకీ తెలిసినవారు 9440796562, 9440796525 సెల్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

దేశాభివృద్ధిలో యువతది కీలకపాత్ర


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య పద్మరాజు


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

- వీసీ ఆచార్య పద్మరాజు
- 'నన్నయ'లో ప్రారంభమైన 'అద్విక 23' టెక్నికల్ ఫెస్టివల్

రాజానగరం: ప్రపంచ దేశాలలో యువత ఎక్కువగా ఉన్నది భారతదేశంలోనే అని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. యువత తమ మేధో సంపత్తితో దేశాభివృద్ధిలో కీలకపాత్ర వహించాలని సూచించారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో 'అద్విక 23' పేరిట రెండు రోజులపాటు జరిగే టెక్నికల్ ఫెస్టివల్ ప్రొగ్రామ్ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీసి, మరింత నగిషీ పట్టేందుకు ఇటువంటి ఫెస్టివల్స్ తోడ్పడతాయన్నారు. యువత సెల్‌ఫోన్లకు బానిసలై కాలాన్ని వృథా చేయకుండా బుర్రకు పదునుపెడితే అధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎన్నో అద్భుతాలను సృష్టించ గలుగుతారన్నారు. నేడు అన్నిరంగాలలోను సాంకేతిక పరిజ్ఞానం అధికంగా ఉంటుందంటూ వైద్యరంగంలో కొన్ని విషయాలను ఉదహరించారు. శిల, శిల్పి, శిల్పం మీరే కావాలంటూ విద్యార్థులను ఆలోచింపజేశారు. ఇంజినీరింగ్ విద్యను నాలుగు సంవత్సరాలపాటు పట్టుదలతో చదివితే ఆపై నాలుగు దశాబ్దాలు ఉన్నతంగా జీవించవచ్చని వీసీ పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి. సుధాకర్ మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య, సర్ ఆర్థర్ కాటన్ వంటి గొప్ప ఇంజినీర్లను ఆదర్శంగా తీసుకుని దేశ, రాష్ట్ర ప్రగతికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జి. వెంకట్రావు, డాక్టర్ కె.నవీన్‌కుమార్‌ల బృందం రచించిన 'అడ్వెన్సెస్ ఇన్ మాథ్యమెటికల్ ఫిజికల్ అండ్ కెమికల్ సైన్సెస్' పాఠ్య పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు. గోదావరి జిల్లాల నుంచి సుమారు 1,200 మంది విద్యార్థులు హాజరై పేపర్, పోస్టర్ ప్రెజెంటేషన్స్, టెక్ క్విజ్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, షార్ట్ ఫిల్మ్ మేకింగ్, ప్రజెంటేషన్ ఆఫ్ ఐడియా విత్ వర్కింగ్ హైపోథిసిస్ డిబేట్ వంటి సాంకేతిక పోటీలలో తమ ప్రతిభను కనబరిచే ప్రయత్నం చేశారు. సాయంత్రం బాస్కెట్ బాల్ కోర్టులో యూనివర్సిటీ విద్యార్థులు ప్రదర్శించిన ఫ్లాష్ మాబ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, కో కన్వీనర్లు బి.లక్ష్మి, జె. హనుమంతు, బి.సుధాకిరణ్, సీహెచ్ శ్రీవర్మ, డాక్టర్ జి.కీర్తిమరిట, ఆంధ్ర యూనివర్సిటీ స్పోర్ట్సు విభాగం ఆచార్య విజయమోహన్, డైరెక్టర్ డాక్టర్ పల్లవి పాల్గొన్నారు.

నాలుగేళ్ల క్రితమే చంద్రబాబును ప్రజలు శిక్షించారు


బీసీ సంక్షేమ మంత్రి వేణు



నిడదవోలు : ప్రజా న్యాయస్థానంలో చంద్రబాబుకి నాలుగేళ్ల క్రితమే ప్రజా న్యాయవాదులు శిక్ష విధించి, ఎన్నికల్లో 23 స్థానాల్లో కూర్చోపెట్టారని బీసీ సంక్షేమ, సమాచార ఫొటోగ్రఫీ శాఖ మంత్రి సీహెచ్ శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో చంద్రబాబు చేసిన మోసానికి, అవినీతికి ప్రజలు మూడు స్థానాలు మాత్రమే ఇచ్చి ఇంట్లో కూర్చో పెడతారన్నారు. చంద్రబాబుకు రిమాండ్ విధిస్తే దత్తపుత్రుడు పవన్ రోడ్డుపై దొర్లుతున్నాడని విమర్శించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాన్ని విడదీసిన పాపం చంద్రబాబుదేన్నారు. కాపుల సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. గత ప్రభుత్వం కాపులను మోసం చేసింది వాస్తవమా కాదా ప్రశ్నించారు. సీఎం జగన్ నిడదవోలులో ఈ నెల16న కాపు మహిళలకు వినాయక చవితి కానుకగా కాపు నేస్తం నిధులు రూ.15 వేలు వారి ఖాతాలకు జమ చేస్తారన్నారు. ఇప్పవరకు కాపు నేస్తం కింద రూ. 2,000 వేల కోట్లు జమ చేశారన్నారు. కాపులకు తీవ్ర అన్యాయం చేసినా చంద్రబాబుకు అధికారం కట్టబెట్టాలనే పవన్‌కల్యాణ్ ఆలోచనను కాపు సోదరులందరూ గుర్తు చేసుకోవాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే జి. శ్రీనివాసనాయుడు పాల్గొన్నారు.

ద్వారంపూడి ఫేస్‌బుక్ ఖాతా హ్యాక్

- సీఐడీకి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే
- పోస్టింగ్‌లను ఫాలో అవ్వొద్దని వినతి


ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఫేస్‌బుక్ ఖాతా హ్యాక్ అయ్యింది. జూలై 16వ తేదీన ఈ విషయాన్ని గుర్తించారు. దీనిపై ద్వారంపూడి విజయవాడ సీఐడీ అధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి ఫేస్‌బుక్ ఖాతాలో అనధికార చొరబాటు(హ్యాకింగ్) నేపథ్యంలో గడచిన కొద్దిరోజులుగా వస్తోన్న కొన్ని పోస్టింగ్‌లపై ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి స్పందిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. ఫేస్‌బుక్ ఖాతాను హ్యాక్ చేసిన వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవలసిందిగా ఇప్పటికే పోలీసుశాఖను కోరానని చెప్పారు. అప్పటి వరకు తన ఫేస్‌బుక్ ఖాతాలో వచ్చే పోస్టింగ్‌లను ఏ ఒక్కరూ ఫాలో అవ్వొద్దని ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రజలు, స్నేహితులు, పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలకు సూచించారు.

రూ.95 వేల అక్రమ మద్యం ధ్వంసం

- భైండోవర్ గీత దాటిన వ్యక్తికి రూ.50 వేల జరిమానా
- జిల్లా ఎస్ఈబీ ఇన్‌చార్జి, ఏఎస్పీ ఖాదర్ బాషా


అక్రమ మద్యాన్ని ధ్వంసం చేస్తున్న ఏఎస్పీ ఖాదర్ బాషా, సీఐ శివరామరాజు, సిబ్బంది

అమలాపురం టౌన్: అమలాపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) స్టేషన్ పరిధిలో 28 కేసులకు సంబంధించిన రూ.95 వేల విలువైన అక్రమ మద్యాన్ని గురువారం సాయంత్రం ధ్వంసం చేశారు. అమలాపురంలోని ఎస్ఈబీ స్టేషన్ ప్రాంగణంలో జిల్లా ఎస్ఈబీ ఇన్‌చార్జి, జిల్లా ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, ఎస్ఈబీ సీఐ వేగిశ్న శివరామరాజు ఆధ్వర్యంలో ఈ అక్రమ మద్యాన్ని నేలపై ఒలకబోశారు. తర్వాత ఆ సీసాలను ధ్వంసం చేశారు. 21 కేసుల్లో పాండిచ్చేరి యానాం నుంచి అక్రమ రవాణా చేసి పట్టుబడ్డ నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డీపీఎల్) 539 సీసాలు, బెల్ట్ షాపుల ద్వారా అక్రమంగా విక్రయిస్తున్న రెండు కేసుల్లో 25 సీసాలను, 19.50 లీటర్ల నాటు సారాను ధ్వంసం చేశారు. కామనగరువు వీఆర్వో అలీ, మహిళా పోలీసు, ఎస్ఈబీ సిబ్బంది కూడా పాల్గొని మద్యాన్ని ఒలకబోశారు.

బైండోవర్‌ను ఉల్లంఘించిన వ్యక్తికి రూ.50 వేల జరిమానా

ఇప్పటికే రెండు అక్రమ మద్యం కేసుల్లో నిందితుడిగా ఉండి ఇటీవల బైండోవర్ కేసు నమోదు అయినా నిబంధనలు ఉల్లంఘించడంతో రూ.50 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఈబీ జిల్లా ఇన్‌చార్జి ఖాదర్ బాషా తెలిపారు. అంబాజీపేట మండలం గంగలకుర్తి అగ్రహారానికి చెందిన కోలా వీర రాఘవులును మండల మేజిస్ట్రేట్, తహసీల్దార్ ముందు హాజరు పరచగా రూ.50 వేలు జరిమానా విధించినట్లు చెప్పారు. అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లిలో నాటు సారా కాచేందుకు ఉపయోగించే 1,800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ కేసులో అదే గ్రామానికి చెందిన కడిమి నాగరాజును అరెస్ట్ చేసినట్లు ఖాదర్ బాషా పేర్కొన్నారు.

గురి చూసి కొట్టారు!

రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు ఇద్దరు పిఠాపురం విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులు

పిఠాపురం: రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు కోచ్ లక్ష్మణరావు తెలిపారు. బుధవారం కాకినాడ డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్కూలు గేమ్స్ సెలెక్షన్స్‌లో అండర్ 14 బాలికల విభాగం ఆర్చరీ ఇండియన్ రౌండ్‌లో పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని పల్లా మహాలక్ష్మి విశేష ప్రతిభ చూపి ఎంపికయిందన్నారు. అదే పాఠశాలకు చెందిన పళ్ల నాని అండర్ 14 బాలుర విభాగం ఆర్చరీ ఇండియన్ రౌండ్‌లో విశేష ప్రతిభ చూపి ఎంపికయ్యాడన్నారు. వీరిద్దరూ త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లో జిల్లా తరఫున పాల్గొంటారని ఆయన తెలిపారు. ఎంపికైన ఇద్దరు విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీవీ రామకృష్ణ, పీడీ మంగయ్యమ్మ అభినందించారు.

పోలవరం కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నల్లజర్ల: పోలవరం కాలువ నీటి ప్రవాహానికి అనంతపల్లి సైఫన్ వద్ద గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పశువుల కాపరుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహం బాగా పాడైపోయింది. ముక్కుపొడం రంగు ప్యాంటు, బ్లూ కలర్ షర్టు వేసుకున్న ఈ వ్యక్తి కాలువ ఎగువ పరీవాహక ప్రాంతం నుంచి కొట్టుకువచ్చినట్టు పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదవశాత్తూ కాలువలో పడి మృతి చెందాడా? లేక ఎవరైనా హత్య చేసి మృతదేహాన్ని కాలువలో పడవేశారా అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ మోహనరావు తెలిపారు. కాలువ ఎగువ ప్రాంతంలో ఈ తరహా వ్యక్తులు కనపడకుండా పోతే నల్లజర్ల పోలీసులకు సమాచారం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఆ వార్డు ఇటు... ఈ వార్డు అటు...

జీజీహెచ్‌లో మార్పు

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో ఎంఎల్‌సీ, నాన్ ఎంఎల్‌సీ వార్డులను మార్పు చేస్తూ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి గురువారం రాత్రి నిర్ణయం తీసుకున్నారు. అత్యవసర విభాగంలోని ఎంఎల్‌సీ వార్డులో నానాటికీ పెరుగుతున్న రోగుల రద్దీ దృష్ట్యా ఎక్కువ పడకలు ఉన్న నాన్ ఎంఎల్‌సీకి ఎంఎల్‌సీ వార్డును, తక్కువ పడకలు ఉన్న ఎంఎల్‌సీకి నాన్ ఎంఎల్‌సీ వార్డును తరలిస్తున్నట్లు ప్రకటించారు. సదరు వార్డుల్లో కేసుల రద్దీకి అనుగుణంగా హెచ్చు తగ్గులుంటే ప్రత్యామ్నాయ సర్దుబాట్లతో రోగులకు నాణ్యమైన వైద్య సదుపాయాలు అందిస్తామని ఆమె తెలిపారు.

సరైన ప్రణాళికతో సివిల్ సర్వీసెస్‌కు ఎంపిక

ఆంధ్రప్రదేశ్ కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కస్టమ్స్ కమిషనర్ నరసింహారెడ్డి

కాకినాడ రూరల్: సరైన ప్రణాళిక, సానుకూల దృక్పథం, పాత క్వశ్చన్ పేపర్లు, సీనియర్ల అనుభవాలు మొదలగు వాటి సహాయంతో సివిల్ సర్వీసెస్‌కు సెలెక్టు అవ్వడం సాధ్యమేనని ఆంధ్రప్రదేశ్ కస్టమ్స్ కమిషనర్(ఐఆర్ఎస్) సాధు నరసింహారెడ్డి తెలియజేశారు. కాకినాడ రూరల్ మండలం వాకలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కిరణ్ కంటి ఆస్పత్రి ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని కాకినాడ డిప్యూటి కమిషనర్ ఆఫ్ కస్టమ్స్ కె.విజయ ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి పాల్గొని పాఠశాలలో సుమారు 100 మంది విద్యార్థులకు పేదరికం నుంచి ఉన్నత స్థాయికి ఏ విధంగా వెళ్లాలో వీడియోలు, ఫొటోలు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించి సందేహాలు నివృత్తి చేశారు. అనంతరం మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు విద్యార్థుల భవిష్యత్తుపై ఏ విధంగా ప్రభావం చూపుతాయో వివరించారు. కేంద్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాల నిర్మూలనకు 'నషా ముక్త్ భారత్' కార్యక్రమం ద్వారా ఏ విధంగా చర్యలు తీసుకుంటుందో వివరించారు. కార్యక్రమంలో కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ వీరవెంకటరెడ్డి, హెచ్ఎం మూర్తి, శ్రీకిరణ్ ఆస్పత్రికి చెందిన రాంప్రకాష్ పాల్గొన్నారు.

గొల్లప్రోలులో చోరీ

పిఠాపురం: గొల్లప్రోలులోని తాళాలు వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ చేసినట్టు గొల్లప్రోలు ఎస్సై వినయ్ ప్రతాప్ తెలిపారు. వివరాల్లోకి వెళితే... గొల్లప్రోలుకు చెందిన బెజవాడ శివ తన భార్య, కుమారుడితో కలిసి గొల్లప్రోలు గంటావారి గొయ్యి ప్రాంతంలోని తన ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఈ నెల 9న కుటుంబ సభ్యులతో కలిసి తుని మండలం వల్లూరులో ఒక వివాహ వేడుకకు వెళ్లారు. 11వ తేదీన తిరిగి వచ్చి చూసే సరికి ఇంటి తలుపుల తాళాలు పగులగొట్టి ఉన్నాయి. అనుమానం వచ్చి వెళ్లి చూడగా బీరువాలోని ఉన్న మూడు కాసుల బంగారు హారం, రూ 18000 చోరీకి గురైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇప్పుడు చంద్రబాబు మోచేతి నీళ్లు తాగుతున్నదెవరు?

- ఎవరినో అందలం ఎక్కించి పల్లకి మోసేందుకు కాపులు సిద్ధంగా లేరు
- పవన్‌కల్యాణ్‌పై ఎమ్మెల్సీ తోట ఫైర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: గత ఎన్నికల్లో తాను టీడీపీ నుంచి పోటీ చేసినప్పుడు చంద్రబాబు మోచేతి కింద నీళ్లు తాగుతున్నాడంటూ తనపై విమర్శలు చేసిన జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎవరి మోచేతి కింద నీళ్లు తాగేందుకు చంద్రబాబుతో జత కట్టారో చెప్పాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రశ్నించారు. ఎవరినో అందలం ఎక్కించి పల్లకి మోసేందుకు కాపుజాతి సిద్ధంగా లేదన్నారు. మండలంలోని తాపేశ్వరంలో గురువారం జరిగిన పింఛన్ల పంపిణీ సభలో టీడీపీ, జనసేన పార్టీల పొత్తుపై ఎమ్మెల్సీ తోట ఘాటుగా స్పందించారు. 2019 ఎన్నికల ముందు తనతో పాటు మరికొందరు కాపు నేతలు పవన్‌కల్యాణ్‌ను కలిశామన్నారు. అయితే ఆయన విధానాలు, మాట తీరు చూశాక తాను టీడీపీలోనే పోటీ చేయాలని నిర్ణయించుకున్నానన్నారు. తాను జనసేన పార్టీలో చేరలేదన్న అక్కసుతో అమలాపురం ఎన్నికల సభలో తననే లక్ష్యంగా చేసుకుని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట గుర్తు చేశారు. తాను ఎవరి మోచేతి కింద నీళ్లు తాగేవాడిని కాదని, కోనసీమ గోదావరి నీళ్లు తాగి పెరిగానని స్పష్టం చేశారు. అవినీతిపై పోరాటం చేస్తున్నానంటూ ప్రగల్భాలు పలుకుతున్న పవన్‌కల్యాణ్ అవినీతితో జైల్లో ఉన్న చంద్రబాబును కలిసి ఆయనతో జత కట్టడం సిగ్గుచేటని మండిపడ్డారు. కాపు నేత సీఎం కావాలని కాపులు కోరుకుంటారని, ఎవరినో అందలమెక్కించి పల్లకి మోసేందుకు కాపులు సిద్ధంగా లేరన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందంటూ గగ్గోలు పెడుతున్న పవన్ కల్యాణ్‌కు కాపు ఉద్యమం సందర్భంగా ముద్రగడ కుటుంబంపై చంద్రబాబు పోలీసులతో అమానుషంగా దాడి చేయించినప్పుడు, కాపులపై అక్రమ కేసులు పెట్టించినప్పుడు ప్రజాస్వామ్యం గుర్తుకురాలేదా అని ప్రశ్నించారు. సింగిల్‌గా పోటీ చేసి రెండు మూడు సీట్లు తెచ్చుకున్నా ఎంతో గౌరవంగా ఉండేదన్నారు. టీడీపీ మనుగడ కోసమే జనసేనతో ఆ పార్టీ పొత్తు పెట్టుకుందన్నారు. చంద్రబాబు పెద్ద అనకొండని, ఆయనతో కలిసి పనిచేసిన సీపీఎం, సీపీఐ తదితర పార్టీలు ఇప్పుడు రాష్ట్రంలో మనుగడ లేకుండా ఉన్నాయన్నారు. రానున్న రోజుల్లో జనసేన పార్టీకి అదే గతి పట్టే ప్రమాదముంది జాగ్రత్తంటూ పవన్‌కల్యాణ్‌కు ఎమ్మెల్సీ తోట హితవు పలికారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు, మండల సేవాదళ్ కన్వీనర్ పోతుల రాంబాబు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

- రూ.22,10,780 స్వాధీనం
- ఎనిమిది మంది అరెస్టు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉండ్రాజవరం మండలంలోని వడ్లమూరు ప్రాంతంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేశారు. దీనికి సంబంధించి జిల్లా ఎస్పీ పి.జగదీష్ గురువారం రాజమహేంద్రవరం దిశ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆ వివరాలను వెల్లడించారు. పోలీసులకు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు కొవ్వూరు సబ్ డివిజన్ డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఉండ్రాజవరం పోలీసు స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె.రామారావు బృందం వడ్లమూరులోని టేకేరు శ్రీను గెస్ట్‌హౌస్‌పై దాడి చేశారు. అక్కడ కోతబంతి పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.22,10,780 నగదు, 9 సెల్‌ఫోన్లు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు. గెస్ట్ హౌస్ యజమాని అయిన భూపతి వెంకట నరసింహరాజు, డొక్కా సోమయ్యలపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ ప్రజలు తమ వంతు బాధ్యతగా తమ పరిసరాల్లో ఎక్కడైనా, ఎవరైనా, ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లయితే వెంటనే డయల్ 100కు, మీ దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. తెలిపినవారి వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. ఇటువంటి నేరాలకు పాల్పడిన, సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. నిందితులను అరెస్టు చేసి, సొమ్ము స్వాధీనం చేసుకున్న పోలీసు సిబ్బందికి ఎస్పీ నగదు బహుమతిని అందించారు.

ఫెన్సింగ్ పోటీలలో రాణించిన హర్షియ హుస్న

రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం కైవసం


హర్షితకు బంగారు పతకం అందిస్తున్న ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్లు సుగుణారెడ్డి, శృతిరెడ్డి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-10 ఫెన్సింగ్ పోటీల్లో గుంటూరు జిల్లాకు చెందిన అద్దేపల్లి హర్షియ హుస్న రాణించి ప్రతిభను కనపరిచింది. ఫాయిల్ వెపన్ విభాగంలో బంగారు పతకం కైవసం చేసుకుంది. ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి 180 మంది హాజరయ్యారు. గుంటూరు జిల్లా కార్యదర్శి అశోక్‌బాబు వద్ద శిక్షణ పొందుతున్న హర్షియా వివిధ కేటగిరిల్లో రజత, కాంస్య పతకాలు తన ఖాతాలో వేసుకుంది. త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు హర్షియా ఎంపికయ్యే అవకాశాలు ఉన్నాయని ఏపీ ఫెన్సింగ్ సంఘ కార్యదర్శి జీఎస్‌వీ కృష్ణమోహన్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించిన హర్షితను ఏపీ ఫెన్సింగ్ సంఘ అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు, కోచ్ అశోక్‌బాబు అభినందించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE
■ రేపూరు సాయిబాబా గుడిదగ్గరలో పడమర ఫేసింగ్ 1706 చ॥గజాల స్థలం మరియు సామర్లకోట పాత ఎమ్.ఆర్.ఓ. ఆఫీస్ దగ్గర 3 BHK ఫ్లాట్లు అమ్మకమునకు కలవు. ✆ : 98482 85844 [R-1878]

Services
■ బంగారము బ్యాంకులలో, ప్రైవేట్, ఫైనాన్స్‌లో తనఖాలలో ఉన్నవి మాత్రమే విడిపించి కొనబడును. వేలంలో ఉన్న బంగారం విడిపించి తక్కువ గడువు తోటి తనఖా ఇవ్వబడును. ✆ : 73966 71666 S [R-6147]

DISTRIBUTORS
■ Wanted District Wise Stockists for European Sofa Fabrics, Wallpapers. Call: 9182931347 [QA-5920]

హోంకేర్ సర్వీస్
■ వృద్ధులకు సేవచేయుటకు, చిన్నపిల్లలను చూసుకొనుటకు వంట పనికోసం పనిచేయుటకు మగ/ఆడ వారు కావలెను. వర్కర్లకు మంచి జీతం. ఏజెంట్లకు కమీషన్ ఇవ్వబడును. 9059835761, 8522903927. [W-1229420]

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-788219]

Wanted
■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221545]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177738926. [M-1221616]

■ శ్రీసాయిరాం హోమ్‌కేర్ Hydలో శ్రీమంతుల ఇండ్లలో ఇంటిపని వంటపని, వృద్ధులను, చిన్న పిల్లలను చూసు కొనుటకు స్త్రీ/పు.కావలెను. జీతం: 18000/- ఏజెంట్ కమీషన్ 7K. 9666001826, 9666001827 [H-189395]

■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీతం:18K. హైదరాబాద్: Ph: 9640258899, విజయవాడ: 9640648899 [HA-612]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 12,000-35,000/- ఫ్రీ రూమ్ + భోజనం. Hyd. ఫోన్ : 7993583999 [HA-608]

■ ఫిమేల్ హాస్టల్ ఇన్‌చార్జీలు కావలెను. జీతము: 10,000/- వరకు ఇవ్వబడును. భోజనం మరియు వసతి ఇవ్వబడును. మాస్టర్ మైండ్స్, 3/11, బ్రాడీపేట, గుంటూరు సెల్ : 9100024059 [G-4651]

■ బాలాజీ హోం కేర్ సర్వీస్ (డీలక్స్) VJA, HYD. శ్రీమంతుల ఇళ్ళలో ముసలివారికి సేవ చేయుటకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు 10th P/F, 19-30 సం. వర్కర్స్/నర్సులు కావలెను భో+ వ+ జీ. 18 to 21 వేలు. ఏజెంట్లకు కమీషన్ 5 వేలు. ✆ 94413 81678, 94413 82678 [B-1068188]

■ రామకృష్ణ హోం కేర్ సర్వీస్ (డీలక్స్) VJA, HYD. శ్రీమంతులల ఇళ్ళలో ముసలివారికి సేవ చేయుటకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు 10th P/F, 19-30 సం. వర్కర్స్/నర్సులు కావలెను భో+ వ+ జీ. 18 to 21 వేలు. ఏజెంట్లకు కమీషన్ 5 వేలు. ✆ 94413 84123, 94413 86123. [B-1206743]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.